క్లుప్తంగా

క్షయవ్యాధి నియంత్రణకు పాటుపడదాం



బాధితునికి కిట్ పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: క్షయవ్యాధి నిర్మూలనకు అందరం పాటుపడాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి పిలుపునిచ్చారు. ఈ మేరకు క్షయవ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీ నుంచి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధిని పౌష్టికాహారంతో నియంత్రించవచ్చని తెలిపారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. క్షయ వ్యాధి బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చినమేరంగి యూనిట్ ఎస్‌టీఎస్ నాగరాణి, ఎంపీహెచ్‌ఓ కర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెదభోగిలిలో పారిశుద్ధ్య పనులు



జేసీబీతో తొలగిస్తున్న చెత్త

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో నాలుగు రోజులుగా పారిశుద్ధ్య పనులతో పాటు అభివృద్ధి పనులు, తాగునీరు పైప్‌ల మరమ్మతులు చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం పెదభోగిలి పంచాయతీ గ్రామాలైన సీతానగరం, బుడ్డిపేట, అప్పయ్యపేట, పెదభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలియజేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే అన్నిగ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి సీతానగరం మండల కేంద్రంలో పెదభోగిలి మేజర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో నైరాశ్యాన్ని నెలకొల్పడానికి ఇతర పార్టీల నాయకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా, వార్డుల వారీగా బూత్‌కమిటీ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి ఓటింగ్ శాతాన్ని పెంచుతూ వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజారిటీ వచ్చేలా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ మండల నాయకులు సవరపు రామారావు, పార్థసారథి, ఎస్ గౌరి, బి.సూర్యనారాయణ, రౌతుఅప్పారావు, పిన్నింటి రామారావు, మాధవ, సబ్బాన ఆనందరావు పి.ఈశ్వరనారాయణ, పి.సత్యనారాయణ, పార్వతీపురం వైస్ ఎంపీపీ ఎస్.జగన్నాథం పాల్గొన్నారు.

బ్రూసెల్లిస్‌పై అప్రమత్తం

పాలకొండ రూరల్: బ్రూసెల్లిస్ వ్యాధిపై పాడిరైతులు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారి సిద్ధార్థ అన్నారు. బ్రూసెల్లిస్ వ్యాధి లక్షణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం పాడిరైతులకు అవగాహన కల్పించారు. 4-8 నెలల మధ్య వయసున్న దూడలకు టీకాలు వేయించటం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా గర్భకోశం రోగాలు అధిగమించ వచ్చన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా గర్భంలో ప్రవేశిస్తుందని తెలిపారు. పాడిరైతులు దీనిని గమనించి టీకాలు పశువులకు క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

భామిని: మండలంలోని పెద్దదిమిలి, కాట్రగడ, కోసలి గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ఫాల్గుణ పూర్ణిమ ప్రాముఖ్యత, హోళీ పండుగ విశిష్టత, రంగుల ప్రాధాన్యతను వివరించారు. ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రచారం చేశారు. ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సువర్ణముఖి నది ఒడ్డున సీసీరోడ్డు, మెట్లు



సింగిరెడ్డి వీధిలో నిర్మించిన కాలువలు



బూర్జ సచివాలయం

బూర్జలో అభివృద్ధి పరుగులు

- రూ.43 లక్షలతో సచివాలయ భవనం
- రూ.21.50 లక్షలతో ఆర్బీకే
- రూ 16.48 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు
- రూ.8.5 లక్షలతో సువర్ణముఖి నదిపై రోడ్డు, కాలువల నిర్మాణం
- రూ.3 లక్షలతో ఇంగిరెడ్డి వీధిలో సీసీరోడ్డు, కాలువ
- రూ.8 లక్షలతో ఎస్సీ వీధిలో సీసీ రోడ్డు, కాలువ
- రూ.24 లక్షలతో ఇంటింటి కుళాయిలు
- రూ 9.6 కోట్లతో సువర్ణముఖి నదిపై వంతెనకు నిధుల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పూర్తికావచ్చిన ఆర్బీకే భవనం

సీతానగరం:



జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతోనే సీతానగరం మండలంలోని బూర్జ గ్రామంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నా రు. బూర్జ పంచాయతీలో కొత్తబూర్జ, పాతబూర్జ గ్రామాలున్నాయి. అలాగే మధుర గ్రామం ఆవాలవలస ఉంది. ఆవాలవలసలో దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరి ష్కారానికి జగనన్న ప్రభుత్వంలో రూ.21 లక్షలు మంజూరు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. గ్రామాల్లో పారదర్శకంగా అర్హులైన పేదలందరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ ఫలాలు సకాలంలో అందజేయడంతో పాటు సీసీ రోడ్లు, సీసీ కాలువలు, కల్వర్టుల అభివృద్ధి పనులు, ఇంటింటి కుళా యి పనులు చేపట్టడంతో పంచాయతీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే జగనన్న కాలనీ మంజూరు కావడం వల్ల ప్రజల సొంతింటి కల నెరవేరింది.



కొత్తబూర్జలో నిర్మించిన సీసీరోడ్డు

గ్రామంలో మౌలిక సదుపాయాలు



మా గ్రామంలో దశాబ్దాల కాలంగా జరిగిన అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. సీరోడ్లు, కాలువలు లేక అవస్థలు పడాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం రావడంతో గ్రామంలోని అన్నివీధులకు సీసీరోడ్లు, కాలువల నిర్మాణం జరిగింది. కాలువల ద్వారా వృథా నీరు మళ్లించడంతో ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి.

–గుజ్జల దాసు, సర్పంచ్, బూర్జ

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



ఉపాధి అవకాశాలు లేక, పనిలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సమయంలో జగనన్న ప్రభుత్వం రావడంతోనే మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో కష్టాలు తీరాయి. మా పిల్లల్ని చదివించడంతో పాటు జగనన్న అమ్మ ఒడి పథకం, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. వర్షాకాలంలో సువర్ణముఖి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నసమయంలో తాగునీరు కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. నది ఒడ్డుకు వెళ్లేందుకు సీసీరోడ్డు,మెట్లు నిర్మించడంతో ఇబ్బందులు తొలిగాయి. ఇంతటి అభివృద్ధి చేసిన జగనన్నకు రుణ పడి ఉంటాం.

–జి.ప్రమీల, అధ్యక్షురాలు, మండలవెలుగు సమాఖ్య

గిరిజనుల మనసు తెలిసిన రాజన్నదొర



సాలూరు: ఉద్యోగిగా, పాలకుడిగా గిరిజనుల మనసు తెలిసిన వ్యక్తి పీడిక రాజన్నదొర. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ.. రాజన్నదొరకు గిరిజన సంక్షేమశాఖమంత్రిగా, డిప్యూటీసీఎంగా బాధ్యతలు అప్పగించారు. ఆ పదవులకు ఆయన వన్నెతెచ్చారు. గిరిజన ప్రాంతాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఇవన్నీ ఆయన విజయానికి కలిసి వస్తాయన్నది రాజకీయ పెద్దల మాట.

పేరు: పీడిక రాజన్నదొర
ప్రస్తుత హోదా : ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి
కులం : ఎస్టీ
పుట్టిన తేది: 01-06-1964
పుట్టిన ఊరు: మర్రివానివలస గ్రామం, మక్కువ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా
విద్యాభ్యాసం: పదో తరగతి వరకు శంబర పాఠశాల, మక్కువ మండలం.
ఇంటర్మీడియట్, డిగ్రీ (బి.ఎ) : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, శ్రీకాకుళం
ఎంఏ (పొలిటిక్స్): ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం
ఉద్యోగం: 21 ఏళ్లకే జీసీసీలో మేనేజర్‌గా చేరారు. 2004లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు.

కుటుంబ నేపథ్యం
రాజన్నదొర భార్య పి.రోజమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. తండ్రి పీడిక లక్ష్మణదొర (మాజీ ఎంపీపీ మక్కువ మండలం), తల్లి రోజమ్మ గృహిణి.

రాజకీయ నేపథ్యం
2004లో ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ తరఫున సాలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనప్పటికీ, గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ గిరిజనుడు కాదని కోర్టులో నిరూపించడం ద్వారా 2006లో ఆయనకు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009, 2014, 2019లో ఎమ్మెల్యేగా ఓటర్లు పట్టంకట్టారు.

ఉన్నత విద్యావంతుడికి అవకాశం



పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజక వర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడైన అలజంగి జోగారావును పార్టీ అధిష్టానం మళ్లీ బరిలోకి దించింది. స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుండడం, ప్రతి ఒక్కరినీ పేరు పెట్టి పిలిచే చనువు, కలివిడి తనం, ఐదేళ్లలో ప్రభుత్వం సాగించిన సంక్షేమ పాలన ఆయనకు మరోసారి విజయాన్ని అందిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పేరు: అలజంగి జోగారావు
ప్రస్తుత హోదా : ఎమ్మెల్యే
విద్యార్హతలు: ఎంటెక్, పీహెచ్‌డీ
కుటుంబ వివరాలు: భార్య లావణ్యకుమారి (ఉపాధ్యాయురాలు),
కుమార్తె: శ్రేయ బీటెక్
రాజకీయ నేపథ్యం: గతంలో బలిజిపేట మండలం ఎంపీటీసీగా పనిచేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పనిచేశారు. అనంతరం 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ ప్రారంభం

మక్కువ: మండలకేంద్రం మక్కువలో సోమవారం కోట దుర్గమ్మ ఆలయ ప్రారంభ కార్యక్రమం వేడుకగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని, కోట దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకువెళ్లారు. వేదపండితులు ఆరవెల్లి విజయ్‌కుమార్‌శర్మ, మొక్కరాల వెంకటరమణమూర్తి కోటదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, కలశాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.



కోటదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకువెళ్తున్న రంగునాయుడు

ఎమ్మెల్యే జోగారావుకే పూర్తి మద్దతు

- ముస్లిం మైనార్టీ సోదరులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకే తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ముస్లిం మైనార్టీల పెద్దలు డిదార్ రజా, ఎం.డి ఫారూక్ ఖాన్ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ పెద్దలు, నాయకులు అందరూ కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండవ దఫా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టికెట్ వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పూర్తి మద్దతు తెలుపుతూ మళ్లీ భారీ విజయం సాధించడంలో తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే జోగారావుకు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కరీమ్, షేక్ పీరు, షేక్ ఇబ్రహీం, నాయకలు షఫీ, జలాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలసిన ముస్లిం మత పెద్దలు

హోర్డింగ్‌లు వాల్ పోస్టర్‌లు తక్షణమే తొలగించాలి

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో హోర్డింగ్‌లు వాల్‌పోస్టర్లు, ప్రభుత్వ వాహనాలపై ఉన్న రాజకీయ నాయకుల ఫొటోల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పెదంకలాం, బూర్జ, లక్ష్మీపురం, పెదభోగిలి, అప్పయ్యపేట గ్రామాల్లో పోస్టర్లు తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిన వాహనాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉన్నందున నాయకుల ఫొటోలపై తెల్లని పేపర్లు అతికించాలని చెప్పారు. అలాగే జగనన్న అభిమానుల ఇళ్లలో ఉన్న స్టిక్కర్లను కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ రేషన్ వాహనాలపై ఉన్న సీఎం ఫొటోపై తెల్లని పేపరు అతికించారు. కృష్ణారాయపురం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, బీఎల్వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు

బల్లకృష్ణాపురంలో ఘనంగా సిర్లి ఎల్లారమ్మ జాతర

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురంలో ప్రజల ఆనందోత్సాహాలతో సిర్లి ఎల్లారమ్మ జాతరను సర్పంచ్ ఎస్.సుశీల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బల్లకృష్ణాపురంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారికి ముడుపులు కట్టి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. సిర్లి ఎల్లారమ్మకు చేపలు, గుడ్లు, వివిధ రకాల పండ్లు, పాలు, పప్పుబెల్లాలు, ఉలవలు, పసుపు కుంకుమ, చలివిడి, చీరలు బ్లౌజ్ పీస్‌లు గాజులను భక్తులు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న వారందరికీ ఉత్సవ కమిటీ సభ్యులు అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, మాజీ సర్పంచ్ డి.సింహాచలం, ఉపసర్పంచ్ బి.జగన్నాథం, బగ్గందొరవలస సర్పంచ్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో జరుగుతున్న పూజలు

ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన

- డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



పార్వతీపురంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, అందుబాటులో ఉన్న వైద్యసేవలు సద్వినియోగం చేసుకునేలా మార్గనిర్దేశం చేసి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీహెచ్‌ఓలకు కేర్ కంపానియన్ ప్రోగ్రాం(సీసీపీ)పై సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ శిక్షణను డాక్టర్ వి.కమల్‌నాథ్ సీసీపీ టెక్నికల్ కన్సల్టెంట్ ఎం.మణి పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యాచ్‌ల వారీగా 26 వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్ మాట్లాడుతూ సీహెచ్‌ఓలు ట్రైనింగ్‌లో పొందిన పరిజ్ఞానంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడేందుకు కృషి చేయాలి. ఇందుకు గాను వారి పరిధిలో ఉండే గ్రామాల ప్రజల ఆరోగ్యానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకోవాలి. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులు, పిల్లలు, కిశోరీ బాలికల ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హైరిస్క్ సమస్యలను గుర్తించి వాటిని నివారించే కార్యచరణ చేపట్టాలని చెప్పారు. పలు ఆరోగ్య సమస్యలు, వాటి లక్షణాలు, నివారణ చర్యలను సులభంగా తెలుసుకునే విధంగా చిత్రాలతో సూచించిన ఫ్లిప్‌చార్ట్‌ల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కోరారు. ఈ విధానం ప్రజల ఆరోగ్య స్థితిని స్వయంగా పునఃపరిశీలించేందుకు దోహదపడుతుం దన్నారు. చికిత్స తర్వాత ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయిన రోగుల ఆరోగ్య పరిశీలన క్షేత్రస్థాయిలో చేస్తూ, త్వరగా కోలుకుని ఆరోగ్యకరమైన స్థితి పొందేలా చూడాలని సూచించారు.

వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి
రక్తహీనత నివారణ, పౌష్టికాహారం, గర్భిణులు శిశువుల్లో హైరిస్క్ సమస్యలు గుర్తించడం, శిశువుకు తల్లిపాలు ఇచ్చే పద్ధతులు, ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, గుండె, శ్వాస సమస్యలు, క్యాన్సర్ బాధితుల ఆరోగ్య పర్యవేక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక దుష్ప్రభావాలు, కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణ, స్త్రీ, పురుష లింగ నిష్పత్తి సమానత్వం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సాధారణంగా ప్రబలే పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, అప్రమత్తం చేయడంపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య వృద్ధికి కృషి చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాల చెందిన హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల పరిశీలన
సీతానగరం: జిల్లాలోని గ్రామీణ వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ఎంఎల్‌ఎహెచ్‌పీలు రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని మరిపివలస, సూరంపేట, వెంకటాపురం గ్రామాల్లో వెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో నమోదవుతున్న ఓపీ, నిర్వహిస్తున్న ఆరోగ్య వివరాలు, వైద్యపరీక్షలు, ఇస్తున్న మందులు తదితర అంశాల రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో దోమలు, అంటు వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పాచిపెంట: ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఈఆర్‌ఓ , ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పాచిపెంట మండలంలోని పి.కోనవలస, పద్మాపురం, కర్రివలస, గైరమ్మపేట, పాచిపెంటలలోని పాఠశాలలు, సచివాలయాలను పరిశీలించారు. రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అందరూ నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పాచిపెంట జెడ్పీహెచ్‌పాఠశాలలో పదవ తరగతి పరీక్షలను పరిశీలించారు. పి.కోనవలస ఐటీడీఏ బంగ్లాలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారితో మాట్లాడామని, సజావుగా ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఈఈ శాంతేశ్వరరావు, డీఈ మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పద్మాపురం ఎంపీపీ పాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

● ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



మక్కువ: పరీక్షాకేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



బలిజిపేట: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



సాలూరు: లయన్స్ క్లబ్ పరీక్షా కేంద్రం ముందు విద్యార్థులు

పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు హాజరై పరీక్షలు రాశారు. తొలిరోజు పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి.